పాఠశాల నిర్వహణ నిధులు విడుదల

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పాఠశాల నిర్వహణ నిధులు ఎట్టకేలకు విడుదలయ్యాయి. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి 50 శాతం నిధులను పాఠశాల విద్యాశాఖ విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. యూ డైస్ ఆధారంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు విడుదల చేసింది. సంగారెడ్డి జిల్లాలో 2003 పాఠశాలలకు రూ.372.2 లక్షల నిధులు విడుదలయ్యాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

సిగాచి బాధితులకు న్యాయం చేయాలి

- ప్రజాసంఘాల ఉద్యమానికి మద్దతు
- బాధితుల తరపున సీఎంతో మాట్లాడుతా..
- తెలంగాణ ఉద్యమనేత ప్రొఫెసర్ కోదండరాం

7లో

ట్రబుల్ 'ఫార్మర్స్'..!

- కాలుతున్న వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు

7లో

కబ్జాలోని శిఖం భూమి స్వాధీనానికి చర్యలు

- పరిశీలించిన సర్వేయర్, ఇరిగేషన్ ఏఈ
- కబ్జాదారులకు తాఖీదుల జారీకి ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కంది, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కంది మండలం మామిడిపల్లి శివారులో కబ్జా కోరల్లో చిక్కుకున్న రూ.కోట్ల విలువైన శిఖం భూమిని స్వాధీనం చేసుకునేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. "మామిడిపల్లిలో కుంట శిఖం భూమి కబ్జా" అనే శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కంది తహసీల్దార్ రవికుమార్ ఆదేశాలతో మంగళవారం సర్వేయర్ కోటేశ్వర్‌రావు, ఇరిగేషన్ ఏఈ మజార్ ఆ గ్రామ రైతులు అంబర్‌సింగ్, సొసైటీ డైరెక్టర్ నర్సింగ్‌నాయక్‌లతో కలిసి కంది మండలంలోని మామిడిపల్లి శివారులోని సర్వేనంబరు 561లో ఊరకుంట చెరువు శిఖం భూమిని పరిశీలించారు. రోడ్డుకు ఎడమ వైపు దాదాపు అర ఎకరం మేర కబ్జాకు గురైందని నిర్ధారణకు వచ్చారు. వెంటనే సర్వేయర్ కబ్జా ప్రాంతాన్ని డిజిటల్ సర్వే మిషన్‌తో హద్దులు గుర్తించారు. కబ్జాకు భూమిని స్వాధీనం చేసుకుని దాని చుట్టూ కందకం తవ్వడంతోపాటు సూచికల బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు ఇరిగేషన్ ఏఈ మజార్ తెలిపారు. కబ్జా దారులకు తాఖీదులు జారీ చేయడానికి తహసీల్దార్ ఆదేశించారు. శిఖం భూమి కబ్జాను వెలుగులోకి తీసుకువచ్చిన "ఆంధ్రజ్యోతి"కి అధికారులు, ఆ గ్రామ రైతులు కృతజ్ఞతలు తెలిపారు.


ఊరకుంట శిఖం కబ్జాను పరిశీలిస్తున్న సర్వేయర్, ఇరిగేషన్ ఏఈ

500 పడకల ఆస్పత్రి, మెడికల్ కాలేజీ నిర్వహణపై జగ్గారెడ్డితో చర్చించిన మంత్రి దామోదర రాజనర్సింహ


సంగారెడ్డిలో ఆస్పత్రి, మెడికల్ కాలేజీ నిర్వహణపై మంత్రి దామోదర్‌తో చర్చిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో ఇటీవల శంకుస్థాపన చేసిన 500 పడకల ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చర్చించారు. మంగళవారం సంగారెడ్డిలో నిర్వహించిన క్యాన్సర్ డే కేర్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఇరువురు నేతలు పలు అంశాలపై మాట్లాడుకున్నారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా వైద్య విద్యార్థులకు, నర్సింగ్ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించే విధంగా చూడాలని జగ్గారెడ్డికి సూచించారు. ఆస్పత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ ఏర్పాటు విషయంపైన చర్చించడం జరిగింది. మెడికల్ కళాశాలలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవడంతో పాటు 500 పడకల ఆస్పత్రిని త్వరగా పూర్తి చేసే విధంగా పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని జగ్గారెడ్డితో మంత్రి అన్నారు. మళ్లీ 11 రోజుల తర్వాత ఈ విషయాలపై సమీక్షించుకుందామని అనుకున్నారు.


సంగారెడ్డిలో క్యాన్సర్ డే కేర్ సెంటర్ ప్రారంభోత్సవంలో మాట్లాడుకుంటున్న మంత్రి దామోదర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

మృత్యు శకటాలు!

- 65వ జాతీయ రహదారిపై గంటల తరబడి భారీ వాహనాల పార్కింగ్
- గమనించక ఢీకొని వాహనదారుల మృత్యువాత
- తరచూ ఘటనలు.. పట్టించుకోని అధికారులు

సంగారెడ్డికి చెందిన ఎస్ఐ రాజేశ్వర్ హైదరాబాద్‌లోని బల్కంపేటలో జూలైలో విధులు ముగించుకొని రాత్రి సమయంలో కారులో వస్తూ కంది మండలం చేర్యాల గేట్ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఈ నెల 7న సంగారెడ్డి పట్టణానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్ పటాన్‌చెరు నుంచి సంగారెడ్డికి బైక్‌పై వస్తూ కవలంపేట వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొని తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలయ్యాడు.

జాతీయ రహదారులపై భారీ వాహనాల పార్కింగ్ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దారి పక్కనే పార్క్ చేసి ఎలాంటి సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రుల్లో ఇతర వాహనదారులు గమనించిక వీటిని ఢీకొని మృత్యువాత పడుతున్నారు. ఇలాంటి ఘటనలు తరచూ జరగడం ఆందోళన కలిగిస్తున్నది.


సంగారెడ్డిలోని 65వ జాతీయ రహదారి పక్కన పార్కింగ్ చేసిన వాహనాలు

సంగారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలు

సంవత్సరం	2022	2023	2024	2025 (జూలై వరకు)
ప్రమాదాలు	789	827	852	470
క్షతగాత్రులు	754	781	913	494
మృతులు	466	432	384	239


అల్లాదుర్గం మండలం రాంపూర్ వద్ద 161వ జాతీయ రహదారిపై మంగళవారం ఆర్టీసీ బస్సును వెనకనుంచి ఢీ కొనడంతో నుజ్జునుజ్జైన కారు... -6లో

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోని 65వ నంబరు జాతీయ రహదారి ఆరు లైన్ల విస్తరణ పనుల కారణంగా రహదారికి ఇరువైపులా గుంతలు తవ్వడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇది చాలదన్నట్లు ఈ రహదారికి పక్కనే ఉన్న పెట్రోల్ బంకుల వద్ద ఇరువైపులా భారీ వాహనాలు గంటల తరబడి పార్కింగ్ చేస్తుండడంతో సమస్య మరింత జఠిలమవుతోంది. ఎటువంటి సూచికా బోర్డులు లేకుండానే వాహనాలను నిలుపడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రాత్రి వేళల్లో కార్లు, ద్విచక్ర వాహనదారులు నిలిచిన ఉన్న భారీ వాహనాలను గమనించకుండా వెనుకవైపు నుంచి ఢీకొట్టి ప్రాణాలు కోల్పోతున్నారు. ఎంతో మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలవుతున్నారు.

సూచిక బోర్డులు లేక..

జాతీయ రహదారి పక్కన భారీ వాహనాలను విచ్చలవిడిగా పార్కింగ్ చేస్తున్నా జిల్లా పోలీసులు పట్టించుకోవడం లేదు. వారు ప్రేక్షకపాత్ర పోషిస్తుండడంతో భారీ వాహనదారులు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. మరోవైపు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నా వాహనదారులు పట్టించుకోకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతుంది. ఈ జాతీయ రహదారిపై పోలీసులు బ్లాక్ స్పాట్లను గుర్తించారు. కానీ రోడ్డు విస్తరణ కారణంగా ఇక్కడ సూచిక బోర్డులను తొలగించారు. దీంతో ప్రమాద స్థలాలను గుర్తించలేక వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు.

బ్లాక్‌స్పాట్లివే..

పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పటాన్‌చెరు ఆర్టీసీ బస్టాండ్, ముత్తంగి వద్ద స్వీట్‌హార్ట్ హోటల్, ముత్తంగి గ్రామం, ఇస్నాపూర్ చౌరస్తా, లక్డారం, నోవాపాన్ చౌరస్తా, రుద్రారం గ్రామాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కవలంపేట, కంది, జమ్‌జమ్ దాబా, పోతిరెడ్డిపల్లి చౌరస్తా, కొండాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ చౌరస్తా, సదాశివపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సదాశివపేట ఆర్టీసీ బస్టాండ్, నందికంది, ఎంఆర్ఎఫ్ కాలనీ, కోహీర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దిగ్వాల్, జహీరాబాద్ పరిధిలో అల్గోల్‌లను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు.

అధికారుల్లో సమన్వయమేదీ?

రోడ్డు ప్రమాదాల నివారణ వివిధ శాఖల అధికారుల సమన్వయంతోనే సాధ్యమవుతుంది. 65వ నంబరు జాతీయ రహదారిపై భారీ వాహనాలను రోడ్లకు ఇరువైపులా పార్కు చేయకూడదని చెప్పేవారే కరువయ్యారు. పోలీసులు, రవాణా శాఖ,

- మిగతా 8వ పేజీలో


వర్చువల్‌గా క్యాన్సర్ డే కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

క్యాన్సర్ బాధితులకు అండగా సర్కార్

- మంత్రి దామోదర రాజనర్సింహ
- సంగారెడ్డి నుంచి వర్చువల్‌గా క్యాన్సర్ డే కేర్ సెంటర్లు ప్రారంభం

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 34 బోధనాస్పత్రుల్లో 10 పడకలతో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ క్యాన్సర్ డే కేర్ సెంటర్లను సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ నుంచి మంగళవారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్యాన్సర్ డే కేర్ సెంటర్లతో చికిత్సను ప్రజలకు చేరువై ఆర్థిక భారం తగ్గనుందన్నారు. త్వరలో అన్ని జిల్లాలకు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. స్క్రీనింగ్ వాహనాలు గ్రామాలలోకి వెళ్లి ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి మెరుగైన చికిత్స అందించే వెసులుబాటు కలుగుతుందన్నారు. క్యాన్సర్ డే కేర్ సెంటర్లల్లో కీమోథెరపీ, పాలియేటివ్ సేవలు పొందవచ్చని తెలిపారు. రోజురోజుకు క్యాన్సర్ గ్రాఫ్ పెరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మన్, ఇంగ్లిష్ భాషలతో సహ విదేశీ భాషల్లో శిక్షణ ఇవ్వడానికి ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఈఎఫ్ఎల్‌యూ)తో వైద్య ఆరోగ్య శాఖ ఒప్పందం(ఎంవోయ)కుదుర్చుకుందని మంత్రి తెలిపారు. అంతకుముందు ఆస్పత్రికి వెనిరావ్ ఫౌండేషన్ తరఫున రూ.1.5 కోట్ల వ్యయంతో వైద్య పరికరాల బహూకరించినందుకు ఫౌండర్ రత్నారెడ్డిని మంత్రి అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, డీఎంఈ డా.నరేంద్రకుమార్, డీపీహెచ్ డా.రవీందర్‌నాయక్, అడిషనల్ డీఎంఈ డా.వాణి, డీఎంఈ ఆఫీస్ స్పెషల్ ఆఫీసర్ విమలథామస్, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.శ్రీనివాసులు, కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోశ్ పంకజ్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి, ఈఎఫ్ఎల్‌యూ డైరెక్టర్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరుకు డీసీహెచ్‌ఎస్ ఆఫీస్!

- జిల్లాకేంద్రంలోనే ఉంచాలంటున్న వైద్యులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): టీవీవీపీ పరిధిలోని జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త(డీసీహెచ్‌ఎస్) కార్యాలయం సంగారెడ్డి నుంచి పటాన్‌చెరుకు తరలించనున్నారు. ఇప్పటివరకు సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మొదటి అంతస్తులో కొనసాగిన ఈ కార్యాలయం పటాన్‌చెరులోని ఏరియా ఆస్పత్రిలోకి తరలించేందుకు అధికారులు యోచిస్తున్నారు. గత కొన్నేళ్లుగా సంగారెడ్డి జిల్లా ఆస్పత్రిలోనే మెడికల్ సూపరింటెండెంట్‌తో పాటు డీసీహెచ్‌ఎస్ కార్యాలయం కొనసాగిన విషయం తెలిసిందే. మూడేళ్ల క్రితం జిల్లా ఆస్పత్రి కొత్త డీఎంఈ పరిధిలోకి వెళ్లి జనరల్ ఆస్పత్రిగా మారినప్పటికీ అదే భవనంలో ఓ వైపు డీసీహెచ్‌ఎస్ ఆఫీస్ కొనసాగిస్తున్నారు. గతంలో డీసీహెచ్‌ఎస్ ఆఫీస్‌ను కలెక్టరేట్‌లోకి తరలించాలని అప్పటి ఉన్నతాధికారులు ఆదేశించినా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. తాజాగా డీసీహెచ్‌ఎస్ ఆఫీస్ తరలింపు మళ్లీ తెరపైకి వచ్చింది. వాస్తవానికి అన్ని శాఖల జిల్లా కార్యాలయాలు జిల్లా కేంద్రంలోనే ఉండాలి. డీసీహెచ్‌ఎస్ కార్యాలయం కూడా జిల్లా కేంద్రంలో ఉంచాలని, ఒకవేళ కుదరని పక్షంలో జిల్లాకు మధ్యలో ఉన్న సదాశివపేట, జోగిపేట మరేదైనా ఏరియా ఆస్పత్రిలోకి తరలిస్తే అందరికి వెసులుబాటు ఉంటుందని డాక్టర్లు, ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఉండాల్సిన డీసీహెచ్‌ఎస్ కార్యాలయం పటాన్‌చెరుకు తరలింపు విషయమై పలువురు సీనియర్ డాక్టర్లు, ఉద్యోగులు ప్రభుత్వ పెద్దల వద్దకు తీసుకెళ్లనున్నట్టు ఆ శాఖ అధికార వర్గాలు తెలిపాయి.





రవాణా చెక్‌పోస్టుల ఎత్తివేత..?

- నేడో, రేపో ఉత్తర్వులు
- వాహన్ యాప్‌లో వాహనాల వివరాలు నమోదు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

7

బతుకమ్మ పండుగకు రేవంతన్న కానుక

- ఎస్‌హెచ్‌జీ సభ్యులకు చీరల పంపిణీకి సన్నద్ధం
- ఒక్కో సభ్యురాలికి రెండు చొప్పున..
- మెదక్ జిల్లాలో 1,54,232 మంది



మెదక్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు బతుకమ్మ పండుగ కానుకగా చీరల పంపిణీకి ప్రభుత్వం సన్నద్ధమవుతుంది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రేవంతన్న కానుక పేరిట ఒక్కో సభ్యురాలికి రెండు చొప్పున చేనేత చీరల పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే కొన్ని జిల్లాలకు చీరలు చేరగా.. మెదక్ జిల్లా కేంద్రానికి మాత్రం ఇంకా చేరలేదు. ఈ నెల 15 నాటికి జిల్లాకు చీరలు చేరే అవకాశాలు ఉన్నాయి. ఈ నెల 21 నుంచి జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ పండగ ప్రారంభం కానుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతీ మహిళకూ ఒక చీర చొప్పున ఇచ్చేవారు. గత సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా బతుకమ్మ పండగకు చీరలు పంపిణీ చేయలేదు. కానీ ఈ ఏడు పండగకు తెలంగాణ ఆడబడుచులకు ఏకంగా రెండేసి చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. మెప్మా ద్వారా పురపాలక సంఘాల సభ్యుల వివరాలు, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లోని సభ్యుల వివరాలు సేకరించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

3,08,464 చీరలు అవసరం..

మెదక్ జిల్లాలో 1,54,232 మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులుండగా, 3,08,464 చీరలు అవసరం. కేవలం మెప్మా సభ్యులకు మాత్రమే చీరలు పంపిణీ చేయనుండడంతో వాటిని యూనిఫాంలకు వాడుకునేందుకు వీలుగా ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక ఇంత పెద్ద మొత్తంలో చీరలను బతుకమ్మ పండగ నాటికి పంపిణీ సాధ్యపడుతుందా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గత ప్రభుత్వం మాదిరిగా మహిళలందరికీ బతుకమ్మ చీరలు పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా క్రిస్మస్, రంజాన్ పండుగలకు కూడా కానుకలు అందించాలన్న డిమాండ్ వ్యక్తమవుతున్నది.

రేషన్‌బియ్యం పట్టివేత


రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ

మునిపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ నుంచి గుజరాత్ రాష్ట్రానికి (కెపి 56- 5735) నంబరు గల లారీలో 250 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ లారీపై అనుమానం వచ్చి తనిఖీ చేయగా.. అందులో పత్రాలు లేని రేషన్‌బియ్యం ఉన్నట్లు గుర్తించారు. పట్టుబడిన రేషన్ బియ్యంతోపాటు లారీని సీజ్‌చేసి సదరు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపారు.

కోర్టు కాంప్లెక్స్ కోసం స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ హైమావతి, జిల్లా న్యాయమూర్తి సాయిరమాదేవి

దుబ్బాక, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మించనున్న కోర్టు కాంప్లెక్స్ కోసం మంగళవారం సిద్దిపేట కలెక్టర్ కె. హైమావతి, జిల్లా న్యాయమూర్తి సాయి రమాదేవి స్థలపరిశీలన జరిపారు. ప్రస్తుత దుబ్బాక కోర్టు ప్రాంతంలో 10 గుంటల స్థలంలో జడ్జి క్వార్టర్స్ నిర్మాణం, పాత తహసీల్దార్ కార్యాలయంలో స్థలసేకరణ జరపాలని నిర్ణయించారు. రెవెన్యూ, సర్వే అధికారులు వెంటనే ప్రభుత్వ భూమి స్థల వివరాలు సర్వే చేసి, ఎంత స్థలం ఉందో సేకరించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే అధికారులు దీనికి సంబంధించిన పూర్తి ప్రక్రియ వెంటనే చేపట్టి, మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. అర్ అండ్ బీ శాఖ అధికారులు సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారమే కోర్టు కాంప్లెక్స్ డిజైన్‌ను రూపొందించాలని ఆదేశించారు. స్థల సేకరణ పూర్తి చేసి, భవన శంకుస్థాపనతోపాటు నిర్మాణం ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. వీరి వెంట జిల్లా అదనపు న్యాయమూర్తి జయ ప్రసాద్, ఆర్డీఓ సదానందంతోపాటు రెవెన్యూ అధికారులు కూడా ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయి పట్టివేత





పట్టుబడిన ఎండు గంజాయి, పత్తి పంటలో సాగుచేసిన గంజాయి మొక్కలను ధ్వంసం చేసిన ఎక్సైజ్ అధికారులు

మునిపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద మునిపల్లి పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాజేష్‌నాయక్ మంగళవారం తన సిబ్బందితో టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపడుతున్నారు. ఈ క్రమంలో ఓ ఆటోపై అనుమానం వచ్చి తనిఖీ చేయగా.. 600 గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులైన హైదరాబాద్‌కు చెందిన ఫవాద్, సయ్యద్ జహీర్, అద్నాన్ హుస్సేన్, మహ్మద్ అఫ్సర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. కర్ణాటక రాష్ట్రం బీదర్‌లో గల ఇరానీ గల్లీలో తక్కువ ధరకు ఎండు గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువకు విక్రయిస్తున్నట్లు వారు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. గంజాయితో పాటు ఆటో, రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజేష్‌నాయక్ చెప్పారు. ఎండు గంజాయిని సరఫరా చేస్తున్న నిందితులను పట్టుకోవడంపై ఎస్ఐ రాజేష్‌నాయక్‌తో పాటు ఏఎస్ఐ బక్కన్న, కానిస్టేబుల్ హనీఫ్, డ్రైవర్ అహ్మద్‌పాషా తదితరులను కొండాపూర్ సీఐ సుమన్‌కుమార్ అభినందించారు.

15 గంజాయి మొక్కల ధ్వంసం

మునిపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుట్టుచప్పుడు కాకుండా సాగుచేస్తున్న గంజాయి మొక్కలను ఎక్సైజ్ అధికారులు మంగళవారం ధ్వంసం చేశారు. మండలంలోని గొర్రెగట్టు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన వ్యవసాయ పొలంలోని పత్తి పంటలో అంతర్ పంటగా గంజాయి సాగుచేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో ఎక్సైజ్, ప్రొబేషనరీ జిల్లా అధికారులు హరిక్రిష్ణ, నవీన్‌చంద్ర ఆదేశాల మేరకు ఎక్సైజ్ సీఐ నజీర్‌పాషా, ఎస్ఐ సతీష్ తన సిబ్బంది మాణిక్‌గౌడ్, పండరి, సుభాష్, శ్రీనివాస్‌తో కలిసి దాడులు నిర్వహించి పత్తి పంటలో 15 గంజాయి మొక్కలను గుర్తించారు. గంజాయి మొక్కలను ధ్వంసం చేసి, వాటిని సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆస్పత్రి భవనాల కూల్చివేతలపై మంత్రి దిశానిర్దేశం


సంగారెడ్డిలోని జీజీహెచ్‌లో నూతన భవన నిర్మాణ నమూనాను పరిశీలిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం సాయంత్రం మంత్రి దామోదర రాజనర్సింహ పర్యటించారు. ఈ నెల 4న రూ.273.40 కోట్లతో 500 పడకల నూతన ఆస్పత్రికి మంత్రి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. అయితే నూతన ఆస్పత్రి భవన నిర్మాణ పనుల్లో భాగంగా పాత భవనాల కూల్చివేతలపై క్షేత్రస్థాయిలో పర్యటించి దిశానిర్దేశం చేశారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక ఏర్పాట్లుచేసి కూల్చివేతలు ప్రారంభించాలని టీజీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులకు మంత్రి ఆదేశించారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, అడిషనల్ డీఎంఈ డా.వాణి, టీజీఎంఎస్ఐడీసీ ఈఈ రవీందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ డా.మురళీకృష్ణ ఉన్నారు.

తల్లి మరణానికి కారణమంటూ కత్తితో దాడి

● వ్యక్తిపై కేసు

కల్హేర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తన తల్లి మరణానికి కారణమని ఓ వ్యక్తి మరో వ్యక్తిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని నాగ్‌ధర్ గ్రామానికి చెందిన మ్యాతరి శ్రీనివాస్, అమృత్ అనే వ్యక్తుల కుటుంబాలు దాయాదులు. అమృత్ తల్లి మూడునెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. శ్రీనివాస్ కుటుంబసభ్యులు మంత్రాలు చేయడం కారణంగానే తన తల్లి మరణించిందంటూ అమృత్ కక్ష పెట్టుకుని సోమవారం రాత్రి కత్తితో దాడికి పాల్పడ్డాడు. అయితే శ్రీనివాస్ చేతులతో అడ్డుకుని అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చారు. ఈలోపే అమృత్ పారిపోయినట్లు తెలిపారు. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అమృత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

గొడ్డలితో చేయి విరగొట్టిన కేసులో ముగ్గురికి జైలు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పొలం తగాదా విషయంలో గొడ్డలితో దాడి చేసి చేయి విరగొట్టిన కేసులో ముగ్గురికి 18 నెలల సాధారణ జైలు, రూ. 4,500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు తీర్పు వెలువరించింది. కేసు వివరాలను మంగళవారం త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ మీడియాకు వెల్లడించారు. 2014లో సిద్దిపేట అర్బన్ మండలం నాంచారుపల్లి గ్రామానికి చెందిన దూలం రాజేశ్వరి తన భర్తతో కలిసి పొలం వద్ద పనులు చేసుకుంటుండగా, గ్రామానికి చెందిన ముగ్గురు ట్రాక్టర్‌పై వచ్చి, గొడ్డలితో దాడి చేశారు. ఈ ఘటనలో ఆమె చేయి విరిగింది. ఈ మేరకు బాధితురాలు అప్పటి ఎస్సై రాజేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపించారు. అప్పటి నుంచి ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు విచారణ జరిగి, మంగళవారం తీర్పు వెలువడింది. కేసులో పారదర్శకంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని కమిషనర్ అనురాధ అభినందించారు.

డీసీహెచ్‌ఎస్‌కు అదనపు బాధ్యతలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా డీసీహెచ్ఎస్(జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త) డా.షేక్ మహ్మద్ షరీఫ్‌కు పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా కొనసాగిన డా.ప్రేమ్‌తో పాటు ఇతరులు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టేందుకు సుముఖంగా లేకపోవడంతో డీసీహెచ్ఎస్ అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి


భవానిపల్లి శివకుమార్(ఫైల్)

చిలప్‌చెడ్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో కూలీ మంగళవారం మృతిచెందాడు. చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన భవానిపల్లి శివకుమార్(27) గ్రామ శివారులో కొండారెడ్డిగారి కొండారెడ్డి వ్యవసాయ పొలంలో గడ్డి కోత మిషన్‌తో గడ్డి కోస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చిట్టోజిపల్లిలో యువకుడు..


తలారి గోవర్ధన్ (ఫైల్)

చేగుంట సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. చేగుంట మండలం చిట్టోజిపల్లి గ్రామానికి చెందిన తలారి భూషణం, నరసమ్మ దంపతులకు కుమారుడు గోవర్ధన్(32), ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అయితే గోవర్ధన్ తమ వ్యవసాయ పొలం వద్ద బోరు మోటార్ నడవడం లేదని సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజ్ వైర్ వేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వెల్లడించారు. ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంతో తల్లిదండ్రుల, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య స్వప్న, పదేళ్లలోపు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

పటాన్‌చెరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుభాష్ వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా చిన్నశంకరపల్లి గ్రామానికి చెందిన భానుప్రకాష్(25) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి స్నేహితుడు బలవంత్‌రెడ్డితో కలిసి బైక్‌పై తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగికి వెళ్లారు. ఈ క్రమంలో గ్రామంలోని లక్కీ బార్ అండ్ రెస్టారెంట్ ఎదురుగా వెనక నుంచి వచ్చిన కంటైనర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వెనక కూర్చున భానుప్రకాష్ కిందపడడంతో కంటైనర్ అతడి పైనుంచి వెళ్లగా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. తండ్రి ఘనపురం విజయ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు చేసుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


సత్యనారాయణ (ఫైల్)

వెల్దుర్తి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. వెల్దుర్తి మండలం అందుగులపల్లి గ్రామానికి చెందిన ఫాం సత్యనారాయణ, సునీత దంపతులకు కుమారుడు, కూతురు. సత్యనారాయణ(40) వ్యవసాయంతో పాటు మేస్త్రీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన సత్యనారాయణ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో మహిళ..


శేషుని బాలమణి (ఫైల్)

మాసాయిపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో ఓ మహిళ మృతిచెందింది. మాసాయిపేటకు చెందిన శేషుని బాలమణి(52) సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్నది. అయితే అర్ధరాత్రి సమయంలో పాముకాటు వేసింది. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం తూప్రాన్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కాగా కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

రాంపూర్ వద్ద రోడ్డు ప్రమాదం

● బస్సును ఢీకొట్టిన కారు, ● ఇద్దరికి తీవ్రగాయాలు


కారులో ఇరుక్కొని ఆర్తనాదాలు చేస్తున్న క్షతగాత్రుడు(వృత్తంలో)



కారు ఢీకొట్టడంతో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు వెనకభాగం

అల్లాదుర్గం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్ వద్ద గల 161వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సంగారెడ్డి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు హైదరాబాద్ నుంచి పిట్లం వైపు వెళ్తున్నది. రాంపూర్ వద్ద గల 161వ జాతీయ రహదారిపై బస్సులోంచి ప్రయాణికులను దింపి ముందుకు వెళ్తున్న క్రమంలో సంగారెడ్డి నుంచి నారాయణఖేడ్ వైపు వెళ్తున్న కారు వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న కామారెడ్డి జిల్లా పిట్లంకు చెందిన సాయి, కోటగిరికి చెందిన స్నేహిత్‌కు గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో జోగిపేట ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గాయాలు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మోపెడ్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మెదక్ రాందాస్ చౌరస్తాలో సంఘటన మంగళవారం చోటుచేసుకంది. మెదక్ పట్టణానికి చెందిన రైతు పెంటయ్య ఫర్టిలైజర్ షాపునకు వెళ్లి మోపెడ్ వాహనంపై తిరిగి వస్తున్నాడు. రాందాస్ చౌరస్తా వద్ద వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన మెదక్ ఆర్టీసీ డిపో చెందిన బస్సు బలంగా ఢీకొట్టింది. దాంతో పెంటయ్య కింద పడగా.. గాలయాలయ్యాయి. అంతేకాకుండా ఆర్టీసీ డ్రైవర్ స్వామి సీటు పైనుంచి కిందికి దిగి వచ్చి గాయపడిన వ్యక్తి పట్ల దురుసుగా ప్రవర్తించాడు. ఇది గమనించిన స్థానికులు డ్రైవర్‌ను మందలించారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని స్టేషన్‌కు తరలించారు. అవగాహన లేని డ్రైవర్లతో బస్సులను నడిపిస్తూ... ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆర్టీసీ తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరు పిల్లలతో మహిళ అదృశ్యం


అదృశ్యమైన తల్లి పిల్లలు(ఫైల్)

నర్సాపూర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైంది. ఈ ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో జరిగింది. ఎస్సై లింగం కథనం ప్రకారం.. మండలంలోని నారాయణపూర్‌కు చెందిన మాణిక్యరాజు ఆటో డ్రైవర్. భార్య భవానీతో పాటు నాలుగున్నరేళ్ల పాప, ఒకటిన్నర సంవత్సరాలు బాబు ఉన్నారు. కుమారుడికి ఆరోగ్యం సరిగ్గా లేక మంగళవారం తన ఆటోలోనే భార్యాపిల్లలతో పాటు తన తల్లి, చెల్లిని తీసుకుని నర్సాపూర్ ఆస్పత్రికి వచ్చాడు. వారిని అక్కడ వదిలేసి వెళ్లిపోయాడు. అయితే, భవానీ అత్తా, ఆడపడుచును ఓ చోట కూర్చొబెట్టి ఓపీ చిట్టీ తీసుకువస్తానని ఇద్దరు పిల్లలను తీసుకుని వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి తల్లి మాణిక్యరాజుకు ఫోన్ చేసింది. అతను వచ్చి వెతికినా లాభం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా భవానీ ఐదు నెలల క్రితం తల్లిగారింటికి వెళ్లింది. సోమవారమే ఆమె తల్లిగారింటి తరఫువారు నచ్చజెప్పి భర్త ఇంటి వద్ద వదిలి వెళ్లారు. మంగళవారం ఆస్పత్రికి వచ్చిన భవానీ ఇద్దరు పిల్లలతో అదృశ్యమైంది. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కసు దర్యాప్తు చేస్తున్నారు.

రవాణా చెక్‌పోస్టుల ఎత్తివేత..?

నేడో, రేపో ఉత్తర్వులు

- వాహన్ యాప్‌లో వాహనాల వివరాలు నమోదు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- చట్టాలను ఉల్లంఘిస్తే 200 శాతం జరిమానా

జహీరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మోటార్ వాహనాల(ఆర్టీఏ) చెక్‌పోస్టులను ఎత్తి వేయనున్నారు. వాహనదారుల సౌలభ్యం, రవాణా వ్యవస్థను ఆధునికీకరణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దేశంలో బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇప్పటికే సరిహద్దు చెక్‌పోస్టులను ఎత్తివేశారు. సత్ఫలితాలు వస్తుండటంతో కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలకు ఈ అంశాన్ని వివరించడం అందుకు రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలతను వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో చెక్‌పోస్టులను ఎతివేసే దిశగా అడుగులు పడుతున్నాయి.



మాడ్గి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహదారులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీఏ అధికారులు

చెక్‌పోస్టులను ఎత్తివేయడం మూలంగా అవినీతి అక్రమాలకు చెక్ పడుతుందని భావిస్తున్నారు. ఒకేపన్ను, ఒకే దేశమనే నినాదంలో భాగంగా జీఎస్టీ ప్రభావం ముున్ముందు వివిధ శాఖలపై పడనుంది. ఈపాటికే వాణిజ్యపన్నులు, తదితర ప్రభుత్వశాఖలపై ప్రభావంపడగా తాజాగ ఆర్టీఏ, ఆర్టీవో చెక్‌పోస్టులపై పడనుంది. దేశవ్యాప్తంగా వివిధరాష్ట్రాల్లో ఈపాటికే ఆర్టీఏ, ఆర్టీవో చెక్‌పోస్టుల ద్వారా నేరుగా యాప్‌లతో పన్ను చెల్లింపులు జరుగుతున్నాయి. ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ఆర్టీఏ, ఆర్టీవో చెక్‌పోస్టులను ఎత్తివేసేందుకు శ్రీకారం చుట్టి జీవోలను సైతం విడుదల చేసినప్పటికీ, పూర్తిస్థాయిలో ఎత్తివేసే తేదీలను ఖరారుపోవడంతో ఇంకా కొనసాగుతున్నాయి. సాధ్యమైనంత వరకు దసరా, దీపావళిలోపే ఈ చెక్‌పోస్టుల ఎత్తివేత జరుగనుందని ప్రచారం జరుగుతుంది.

'వాహన్‌యాప్'పై అవగాహన

సరిహద్దు చెక్‌పోస్టుల ఎత్తివేసే దిశగా వాహనదారులు వివిధ రకాల పన్నులను చెక్‌పోస్టుల వద్ద కాకుండా కేంద్రప్రభుత్వం తీసుకు వచ్చిన మినిస్ట్రీ ఆఫ్ రోడ్‌ట్రాన్స్‌పోర్టు(మోర్త్) హై వేస్‌లో భాగంగా 'వాహన్ యాప్' ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. ఈ యాప్‌పై వాహనదారులు పన్నులను ఎలా చెల్లించాలనే విషయమై ఆయా చెక్‌పోస్టుల వద్ద అధికారులు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు. ఆయా చెక్‌పోస్టుల వద్ద పోస్టర్‌లను ఏర్పాటు చేసి చెల్లింపులకు సంబంధించి అవగాహన కల్పిస్తున్నారు. చెక్‌పోస్టుల పరిధిలో వాహనదారులు చెల్లించే పన్నులు, ఏయే రకాల పన్నులు వస్తాయి, వాహనాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు నమోదు చేస్తున్నట్లు సమాచారం. చెక్‌పోస్టుల ఎత్తివేత విషయమై ఆగస్టులోనే జీవో రావడంతో అప్పటినుంచే వాహనదారులకు అవగాహన కార్యక్రమం ముమ్మరం చేశారు. ఆన్‌లైన్‌లో చెక్‌పోస్టులకు సంబంధించి పూర్తిస్థాయిలో వివరాలు నమోదయ్యాక, వాహనదారులకు అవగాహన వచ్చే వరకు ప్రభుత్వాలు వేచి చూస్తున్నాని అధికారులు వివరించారు. ఈప్రక్రియ పూర్తయితే ఏక్షణమైన చెక్‌పోస్టులు రద్దు చేస్తామనే ప్రకటన వెలువడొచ్చని అందులో పనిచేసే అధికారులు పేర్కొంటున్నారు. ఈ విధానం ద్వారా సమయం ఆదా కావడంతోపాటు, లంచాలకు ఆస్కారం లేకుండా పోతుందని, నేరుగా వాహనదారులకే ప్రయోజనం జరుగనుందని విస్తృతంగా ప్రచారం జరుగుతుంది.



మొగుడంపల్లి మండలం మాడ్గి గ్రామశివారులో ఏర్పాటు చేసిన ఆర్‌టీఏ చెక్‌పోస్టు

రాష్ట్రంలో 15 చెక్‌పోస్టుల ఎత్తివేత

తెలంగాణ వాప్తంగా వివిధ ప్రాంతాల్లో సుమారు 15 చెక్‌పోస్టులున్నాయి. నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, నల్గొండ, కరీంనగర్ డివిజన్ పరిధిలో సాలూర, మద్నూరు, చిరాగ్‌పల్లి, భోరజ్, భైంసా, వాంకిడి ప్రాంతాల్లో ఆర్‌టీఏ చెక్‌పోస్టులున్నాయి. ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో కోదాడ-2, విష్ణుపురం, నాగార్జునసాగర్, తుంగభద్ర-2, పాల్వంచ, కల్లూరు, అశ్వారావుపేట తదితర చెక్‌పోస్టులున్నాయి. వీటన్నింటిని ఎత్తివేసే దిశగా కసరత్తు ముమ్మరం చేస్తున్నారు.

చట్టాలను ఉల్లంఘిస్తే 200 శాతం జరిమానా

వాహన్ యాప్ ద్వారా వాహనదారులు పన్నులను చెల్లించకుంట ఎగ్గొడితే దొరికిన సమయాల్లో మోటారు వాహనాల చట్టం ప్రకారం 200 శాతం జరిమానాలు వేయనున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. సాధారణంగా వాహనాలకు సంబంధించి 12 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే, అధికారుల కళ్లు కప్పి తిరిగితే, దొరికిన సమయంలో 200 శాతం జరిమానాలు వేయనున్నారు. ఇక పోతే ఎంవీఐలు, ఏఎంవీఐలకు నెలకు సుమారు రూ. 10 లక్షల పన్ను వసూలు టార్గెట్ పెట్టనుండగా, వాహనదారులపై ఒత్తిడి తెచ్చేందుకు అధికారులు సైతం సన్నద్ధమవుతున్నారు. చెక్‌పోస్టులు ఎత్తి వేస్తే ఇక్కడ పని చేసే అధికారులను ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి మారుస్తున్నట్లు తెలిసింది. వారంతా బృందాలుగా ఏర్పడి మొబైల్ పద్ధతిలో వాహనాల తనిఖీలు చేపట్టనున్నారు.

చాకరిమెట్ల హుండీ ఆదాయం రూ.6.42 లక్షలు



హుండీని లెక్కిస్తున్న భక్తులు

శివ్వంపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయం హుండీని దేవాదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు ఆధ్వర్యంలో భక్తులు మంగళవారం లెక్కించారు. ఆరునెలల హుండీ ఆదాయం రూ.6 లక్షలా 42 వేల 3 వచ్చినట్లు ఈవో సార శ్రీనివాస్ తెలిపారు. ఈ ఆదాయాన్ని బ్యాంకులో జమచేసి, దేవాదాయశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఆలయ అభివృద్ధి ఖర్చు చేయునట్లు ఇన్‌స్పెక్టర్ రంగారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన పూజారి దేవదత్తశర్మ, గ్రామస్థులు నర్సింగ్‌రావు, కిషన్‌రావు పాల్గొన్నారు.

లాజిస్టిక్ పార్కు కోసం అధికారుల సర్వే



పర్కిబండ ఫారెస్టులో సర్వే చేస్తున్న రెవెన్యూ, ఫారెస్టు అధికారులు

మనోహరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ టీజీటీపీసీ ద్వారా ఏర్పాటు చేయనున్న లాజిస్టిక్ పార్కు కోసం రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు మంగళవారం సర్వే చేపట్టారు. మనోహరాబాద్ మండలం పర్కిబండ, తుపాకులపల్లి గ్రామ శివారులోని భూసేకరణలో భాగంగా గత ప్రభుత్వం 315 ఎకరాల భూమిని తీసుకున్నది. ఇందులో భాగంగా జాతీయ లాజిస్టిక్ పార్కులో డ్రైపోర్టు నిర్మించడం కోసం ముందుగా కేంద్ర ప్రభుత్వం 72 ఎకరాల భూమిని కేటాయించింది. దీంతో టీజీటీపీసీ ఆధ్వర్యంలో ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి చంద్రశేఖర్, చేగుంట ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు.

ట్రబుల్ 'ఫార్మర్స్'..!



టాన్స్‌ఫార్మర్లు తీసుకువచ్చిన ట్రాక్టర్లు

- కాలుతున్న వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు
- లో వోల్టేజీ వల్లేనంటున్న రైతులు
- ఒక్క రోజే ఏడు మరమ్మతు కేంద్రానికి..
- సొంతంగా తీసుకొస్తున్న రైతులు

తూప్రాన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మొన్నటి వరకు భారీ వర్షాలు, వరదలు రైతులను అతలాకుతలం చేయగా, కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు రైతులను ఊపిరి ఆడకుండా చేస్తున్నాయి. వర్షాలు తగ్గడంతో రైతులు వ్యవసాయ బోర్లను వినియోగిస్తున్నారు. బోర్లు నడుస్తుండటంతో వ్యవసాయ విద్యుత్ డిమాండ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడుతుంది. దీంతో లోడ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. మెదక్ జిల్లా తూప్రాన్ పరిసర గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి పెద్ద ఎత్తున మరమ్మతు కేంద్రాలకు తరలిస్తున్నారు. పట్టణ పరిధి పోతరాజుపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం ఉండగా, అక్కడ తూప్రాన్, మనోహరాబాద్, శివ్వంపేట, వెల్దుర్తి, మాసాయిపేట మండలాలకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతులు చేస్తుంటారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ లోవోల్టేజీ వస్తుండటంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నట్లు రైతులు వాపోయారు. పోతరాజుపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రానికి మంగళవారం ఒక్కరోజే ఏడు ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుల కోసం వచ్చాయి. తూప్రాన్ పరిధి శివ్వంపేట, చెట్ల తిమ్మాయిపల్లి, వెంకటాయపల్లి, చిన్నగొట్టిముక్కల, వెల్దుర్తి, మంగళపర్తి, మానెపల్లి రైతులు ట్రాక్టర్లపై కేంద్రానికి తీసుకొచ్చారు. పొలాల వద్ద ఏర్పాటు చేసిన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగానే విద్యుత్ అధికారులు గుర్తించి మరమ్మతు కేంద్రాలకు తరలించి మరమ్మత్తులు చేయించి తిరిగి బిగించాల్సి ఉంటుంది. కానీ, ప్రస్తుతం విద్యుత్ అధికారులు పట్టించుకోక పోవడంతో రైతులే ట్రాన్స్‌ఫార్మర్లు సొంత, అద్దె ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకొని మరమ్మతు కేంద్రాలకు తీసుకువస్తున్నారు.

సిగాచి బాధితులకు న్యాయం చేయాలి

- ప్రజాసంఘాల ఉద్యమానికి మద్దతు
- బాధితుల తరపున సీఎంతో మాట్లాడుతా..
- తెలంగాణ ఉద్యమనేత ప్రొఫెసర్ కోదండరాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాద ఘటనతో బాధిత కుటుంబాల బతుకుల ఆగమయ్యాయని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. ఆ కుటుంబాలకు పూర్తిస్థాయి నష్టపరిహారం అందకపోవడంపై ప్రజా సంఘాలు చేస్తున్న పోరాటానికి తన మద్దతు ఉంటుందని ప్రకటించారు. సిగాచి పరిశ్రమ ఘోర ప్రమాదంలో మృతి చెందిన బాధితులకు మిగిలిన రూ. 75 లక్షలు తక్షణమే అందించాలని, గాయపడ్డ వారికి న్యాయం చేయాలని, యజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సైంటిస్ట్స్ ఫర్ పీపుల్, మానవ హక్కుల వేదిక, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక, అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ముత్తంగి పీఎస్ఆర్ గార్డెన్‌లో టీపీజేఏసీ కన్వీనర్ వై. అశోక్‌కుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కోదండరాం మాట్లాడుతూ సిగాచి ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి, అందులో యజమాన్య ప్రతినిధుల పేర్లు ఎవరివీ చేర్చకపోవడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ ఉద్యమంలో ముందుగా పేర్లు పెట్టకుండా కేసులు నమోదు చేసేవారని, ఆ తర్వాత వారికి వ్యతిరేకంగా ఉన్న వారి పేర్లు చేర్చి బాధలు పెట్టేవారని ఆయన గుర్తు చేశారు. కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. పారిశ్రామికీకరణ అవసరమే కానీ, కార్మిక హక్కులు కూడా ముఖ్యమన్నారు. పారిశ్రామికీకరణ అభివృద్ధి చెందుతున్న పలు దేశాల్లో తప్పిదాలు చేసే పరిశ్రమలపై చర్యలు కూడా కఠినంగానే ఉంటాయన్నారు. సిగాచి బాధిత కుటుంబాలకు న్యాయం చేయటానికి అవసరమైతే ముఖ్యమంత్రితో మాట్లాడతానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. సైంటిస్ట్ ఫర్ పీపుల్ నాయకులు, సిగాచీ కేసు పిటిషన్‌దారు డాక్టర్ కె. బాబురావు, సిగాచి పరిశ్రమపై పౌర సంఘాలు వేసిన కేసులో న్యాయవాది వసుధ నాగరాజ్, టీపీజేఏసీ కన్వీనర్ వై. అశోక్‌కుమార్, రాష్ట్ర కో కన్వీనర్ కన్నెగంటి రవి, విద్యా కమిషన్ సలహాదారుడు ఆర్. వెంకట్‌రెడ్డి, ఏపీసీఆర్ కన్వీనర్ డాక్టర్ ఉస్మాన్, మాంట్ ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ నుంచి బ్రదర్ వర్గీస్, నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ మానవ హక్కుల వేదిక నాయకులు రోహిత్, స్థానిక నాయకులు కార్మిక సంఘాల నాయకులు ఈశ్వర్ ప్రసాద్, అనురాధ, మాణిక్యం, వి.ప్రకాష్ రావు, నరసింహారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో మాట్లాడారు.

ఆయన చనిపోయారన్న బెంగతో అత్త మృతి



సిగాచి ప్రమాదంలో నా భర్త భీమ్‌రావు చనిపోవడంతో అతని తల్లి సుందరబాయి బెంగ పెట్టుకుని ఆమె కూడా చనిపోయింది. మహారాష్ట్రకు చెందిన మేము బండ్లగూడలో ఉంటున్నాం. చిన్న వయసులోనే భర్తను, అత్తను కోల్పోయా. సంవత్సరం నిండని బిడ్డతో జీవితం భయంకరంగా మారింది.

- కార్మికుడు భీమ్‌రావు భార్య సోని

గాయాలు తగ్గకుండానే డిశ్చార్జ్ చేశారు..



సిగాచి ప్రమాదంలో నా కుమార్తె సుష్మ తీవ్రంగా గాయపడింది. ఆమె పూర్తిగా కోలుకోముందే పరిశ్రమ యాజమాన్యం ఆస్పత్రికి ఫోన్ చేసి, ఎన్ని రోజులు ఆస్పత్రిలో ఉంచుకుంటారని బెదిరించారు. దీంతో కోలుకోకముందే నా బిడ్డను డిశ్చార్జ్ చేశారు. బయట చికిత్స చేయించుకునేందుకు చాలా ఖర్చు అవుతోంది.

- బాధితురాలి తల్లి ప్రమీల





హుస్నాబాద్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు, చేగుంట రైతు వేదిక వద్ద యూరియా కోసం తెల్లవారుజాము నుంచే బారులు తీరిన రైతులు

తప్పని యూరియా కష్టాలు

- అర్ధరాత్రి వచ్చి పడిగాపులు
- అయినా దొరకని యూరియా
- నిరుత్సాహంతో రహదారులపై రాస్తారోకోలు

\- న్యూస్ నెట్‌వర్క్

రైతులకు ఇప్పట్లో యూరియా కష్టాలు తప్పడం లేదు. అర్ధరాత్రి వచ్చి యూరియా కోసం పడిగాపులు కాసినా దొరకని పరిస్థితి. సాయంత్రం వరకూ క్యూలో నిల్చున్నా కొందరికి ఒక్క బస్తా దొరికితే.. మరికొంతమందికి అది కూడా దొరకడం లేదు.

సిద్దిపేట జిల్లాలో..

●చేర్యాల: టోకెన్లు జారీచేసి వారంరోజులైనా యూరియా అందించకపోవడం తగదని డిమాండ్ చేస్తూ రైతులు మంగళవారం చేర్యాలలో రాస్తారోకో నిర్వహించారు. స్థానిక బాలాజీ కళామందిర్ క్రాస్‌రోడ్డు వద్ద జనగామ-సిద్దిపేట జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. చేర్యాల సీఐ ఎల్.శ్రీను, ఎస్‌ఐ నవీన్‌తో పాటు ఏడీఏ రాధిక ఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడడంతో ఆందోళన విరమించుకున్నారు.

●హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని మన గ్రోమోర్, వెంకటేశ్వర ఎరువుల దుకాణాల వద్ద తీవ్రమైన ఎండలో రైతులు ఎరువుల కోసం బారులు తీరారు. ఒక్క బస్తా కోసం పొద్దంతా ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

●దౌల్తాబాద్: దౌల్తాబాద్ మండల పరిధిలోని పలు గ్రామాల రైతులు యూరియా కోసం సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు క్యూలో నిలబడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్యూలైన్ స్థానాలను కాపాడుకోవడానికి చెప్పులు, వరిగుజ్జు కట్టలు, మందు బాటిల్లు, ఖాళీసీసాలు పెడుతున్నారు.

మెదక్ జిల్లాలో..

●తూప్రాన్: అవసరమైన యూరియా ఎరువు అందజేయడం లేదని రైతులు తూప్రాన్ పట్టణంలో గంటకుపైగా రాస్తారోకో చేశారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రైతులను ఎస్‌ఐలు యాదిగిరి, జ్యోతి సముదాయించి పక్కకు తీసుకెళ్లినా మళ్లీ రోడ్డుపై కూర్చొని రాస్తారోకో చేశారు. గంట తర్వాత తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి వచ్చి కలెక్టర్‌తో మాట్లాడానని, రేపు, ఎల్లుండి 2000 బస్తాల యూరియా వస్తుందని చెప్పడంతో రైతులు శాంతించారు.

●చేగుంట: చేగుంటకు యూరియా వస్తుందన్న సమాచారంతో మండలంలోని రైతులు మంగళవారం తెల్లవారుజాము నుంచే రైతువేదిక వద్ద బారులుతీరారు. అయితే మండలానికి 700 బస్తాలు రాగా.. 1000 మంది క్యూలో నిల్చున్నారు. అధికారులు టోకెన్ల ద్వారా 700 మందికి యూరియా పంపిణీ చేశారు. యూరియా దొరకని వారు వెనుదిరిగిపోయారు.

●మనోహరాబాద్: మనోహరాబాద్ మండల కేంద్రంలో యూరియా కోసం రైతువేదిక వద్ద టోకెన్లు ఇస్తున్నారన్న విషయం తెలిసిన రైతులు భారీగా తరలివచ్చారు. అధికారులు కేవలం 400 మందికి మాత్రమే టోకెన్లు ఇచ్చి.. మిగతావారికి నచ్చజెప్పి పంపించారు.

యూరియా క్యూలైన్‌లో గొడవ

- చెప్పులతో కొట్టుకున్న మహిళలు



గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో చెప్పులతో కొట్టుకుంటున్న మహిళలు

గజ్వేల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో యూరియా కోసం మహిళా రైతులు మంగళవారం ఉదయం 2 గంటల నుంచే క్యూలైన్‌లో నిల్చున్నారు. ఉదయం వచ్చి నిలబడిన తమను కాదని ముందు వరుసలో మరో మహిళ వచ్చి నిలబడిందని తీవ్ర పదజాలంతో దూషణలు చేసింది. ఈ క్రమంలో ఇద్దరికి మధ్య మాటామాటా పెరిగి చివరకు దాడి చేసుకుని, చివరికి చెప్పులతో కొట్టుకునే వరకు వచ్చింది. ఇది చూసిన అక్కడి రైతులు వారిని సముదాయించి విడిపించారు. కాగా మహిళా రైతులు గజ్వేల్ మండలం అహ్మదీపూర్ వాసులుగా తెలిసింది. రైతులు దాదాపుగా 500 మీటర్లకు పైగా చెప్పులు, జిరాక్సు కాపీలు క్యూలైన్‌లో పెట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అదును దాటుతుంటే రైతులకు ప్రభుత్వాలు యూరియాను అందించడం లేదని, యూరియా కోసం నిత్యం ఎదురుచూడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం సరిపడా యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు.

యూరియా కోసం రైతులకు ఇన్ని కష్టాలెందుకు?

- ఎమ్మెల్యే సునీతారెడ్డి



యూరియా విషయమై మండల వ్యవసాయ అధికారిని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే

నర్సాపూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ ప్రభుత్వం ఉన్నపుడు రాని యూరియా కష్టాలు ఇప్పుడు ఎందుకొస్తున్నాయని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. మంగళవారం సాయంత్రం నర్సాపూర్‌లో రైతువేదిక వద్ద రైతులు యూరియా కోసం నిరీక్షిస్తున్న విషయం తెలుసుకుని అక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడును ఎమ్మెల్యేతో వెళ్లబోసుకున్నారు. ఐదురోజులుగా యూరియా కోసం వస్తున్నా ఇదిగో అదిగో అనుడే.. కానీ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను సంప్రదించి యూరియా వచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. రేవంత్ సర్కార్‌కు ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో పాటు పరిపాలనపై అవగాహన లేక రైతులు కష్టాలు పడాల్సి వస్తుందన్నారు.

ప్రభుత్వ చేతగానితనంతోనే యూరియా కష్టాలు

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనంతోనే రాష్ట్రంలో యూరియా కష్టాలు తలెత్తాయని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చేర్యాల మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నామని, ప్రస్తుతం యూరియా కోసం రైతులే స్వచ్ఛందంగా రోడ్డెక్కి ఆందోళనలు కొనసాగిస్తుండడం దురదృష్టకరమన్నారు.

మల్లన్న ఆలయాన్ని పట్టించుకోకపోవడం తగదు

కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్‌లో చేర్చడంలో నిర్లిప్తత ప్రదర్శించడం తగదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. వారానికో ఈవో మారుతున్న పరిస్థితి నెలకొన్నా పట్టించుకోకపోవడం సబబుకాదన్నారు. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మల్లన్నను ఇలవేల్పుగా కొలుస్తున్నా ఆలయాన్ని మాస్టర్‌ప్లాన్‌లో చేర్చకపోవడం శోచనీయమని అన్నారు.

కలెక్టర్‌తో మాట్లాడిన 'పల్లా'

యూరియా కొరతతో పాటు రైతుల ఆందోళన పట్ల కలెక్టర్ హైమావతితో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. చేర్యాల మండలంలోని పలు గ్రామాలకు యూరియా అందించాలని కోరగా, రెండు, మూడురోజుల్లో సరఫరా చేస్తామని కలెక్టర్ హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు మేడిశెట్టి శ్రీధర్, వుల్లపంల్లి కరుణాకర్, పార్టీ మండలాధ్యక్షులు అనంతుల మల్లేశం, గీస భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పీహెచ్‌సీకి స్థల పరిశీలన

నిజాంపేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెవెన్యూ అధికారులు స్థల పరిశీలన చేసి వైద్యాధికారులకు అప్పగించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక సమీపంలో ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన 658 సర్వే నంబర్‌లో గల ఎకరం 20 గుంటల భూమిని పరిశీలించి మంగళవారం వైద్యాధికారులకు అప్పగించారు కార్యక్రమంలో వైద్యాధికారి హరిప్రియ, సర్వేయర్ ప్రశాంత్, వైద్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కాలనీ అభివృద్ధికి చర్యలు: ఎమ్మెల్యే

పటాన్‌చెరు సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ కాలనీగా సీతారామపురం అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధి సీతారామపురం కాలనీని సందర్శించారు. సమస్యలు తెలుసుకున్నారు. లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

బస్తీల్లో కొత్తగా మురుగు పైపులైన్‌లు

రామచంద్రాపురం టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో పాతకాలం నాటి మురుగు పైపులైన్‌లు తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్‌లో రూ.12లక్షల అంచనా వ్యయంతో పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభించారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఏరియా కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని ఎంపీడీవో కార్యాలయం ముందు సీపీఎం నాయకులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వీధి దీపాలు సక్రమంగా లేవని, మురుగు కాలువలు కంపు కొడుతున్నాయన్నారు. అనంతరం ఎంపీడీవో యాదగిరిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. వెంట నాయకులు శ్రీనివాస్, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

మేళాలతో విద్యార్థులకు ప్రయోజనం

రామచంద్రాపురం టౌన్ సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిత్యం మేళాల ఏర్పాటుతో విద్యార్థులకు ప్రయోజనకరంగా మారుతుందని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శారద పేర్కొన్నారు. మంగళవారం తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామం ప్రభుత్వ పాఠశాలలో టీఎల్ఎం మేళా నిర్వహించారు. 11పాఠశాలల విద్యార్థులు 22కు పైచిలుకు స్టాల్స్ ఏర్పాటు చేసి మేళా నిర్వహించారు. ఉపాధ్యాయులతో పాటు తల్లితండ్రులు మేళాను వీక్షించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

నారాయణఖేడ్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి చెందింది. నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన మేకల సంతుకు చెందిన పాడిగేదె గ్రామ శివారులో మేత మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో త్రీఫేజ్ విద్యుత్ వైరుకు తగిలి అక్కడికక్కడే మరణించింది. దీని విలువ రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం పరిహారం అందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, గొల్లకురుమ సంఘం తాలుకా ఉపాధ్యక్షుడు మల్గొండ కోరారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

హవేళిఘణపూర్, సెప్టెంబరు 9;(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడి గ్రామ పరిధిలోని దూప్‌సింగ్ తండాలోని ప్రజలకు లయన్స్‌క్లబ్ రాష్ట్ర సభ్యుడు అమర్‌నాథ్ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డిస్టిక్ గవర్నర్ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. భారీ వర్షాలతో తండావాసులు తీవ్ర అవస్థలు పడ్డారని, అందువల్ల వారికి సహకారమందించినట్టు తెలిపారు.

ఉల్లాస్‌పై శిక్షణ

నర్సాపూర్/చిన్నశంకరంపేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలోని నిరక్షరాస్యులైన ప్రతి ఒక్కరికి అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్‌లో ఎంఈవో తారాసింగ్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. హెచ్ఎంలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులకు శిక్షణనందించినట్టు తెలిపారు. చిన్నశంకరంపేట మండల పరిధిలోని సూరారం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్లకు ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎంఈవో పుష్పవేణి హాజరయ్యారు.

మహిళలకు షీటీం పై అవగాహన

మనోహరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలోని మహిళా కార్మికులకు షీటీం పై అవగాహన కల్పించారు. మనోహరాబాద్ మండలం రామాయపల్లి గ్రామ శివారులోని ఇండస్ మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పరిశ్రమలో తూప్రాన్ డివిజన్ చెందిన, షీ టీం ద్వారా ఎస్ఐ సుభాష్‌గౌడ్ అవగాహన కల్పించారు. పరిశ్రమలలో మహిళా ఉద్యోగులు సురక్షితమైన, గౌరవప్రదమైన, వాతావరణం అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు ఆపదలో ఎలాంటి ఆందోళన లేకుండా ఫిర్యాదు చేయ్యడం, ఇతరులకు రక్షణ కల్పించడంపై అవగాహన కల్పించారు. ఇందులో షీటీం బృందం, పరిశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాకవి కాళోజీ సేవలు మరువలేనివి

● జయంతి కార్యక్రమాల్లో ఘనంగా నివాళి



సంగారెడ్డి కలెక్టరేట్, జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



మెదక్ ఎస్పీ కార్యాలయంలో నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



మెదక్ కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న డీఆర్వో భుజంగరావు

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతిని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు విద్యాసంస్థల్లో తెలుగు బాషా దినోత్సవాన్ని నిర్వహించి తెలుగుబాష ప్రాముఖ్యతను చాటారు. తెలుగు సాహితీ రంగానికి ప్రజాకవి కాళోజీ చేసిన సేవలు మరవలేనివని కొనియాడారు.

సంగారెడ్డిలో...

సంగారెడ్డి కలెక్టరేట్‌లో కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులఅర్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో పద్మజారాణి మాట్లాడుతూ కళ, సాహిత్య, సామాజిక న్యాయం కోసం కాళోజీ చూపిన మార్గాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బిసి అభివృద్ధి శాఖ అధికారి జగదీష్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. చౌటకూర్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అనుదీప్, రెవెన్యూ సిబ్బందితో కలిసి కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జగ్జీవన్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో కాళోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కోహీర్‌లోని తహసీల్, ఎంపీడీవో కార్యాలయాల్లో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ సుప్రియ ఎంపీడీవో భారతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో కాళోజి జయంతిఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ కోసం కాళోజి చేసిన కృషిని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో జాగోతెలంగాణ రాష్ట్రనాయకులు రాములునేత, మున్సిపల్ కమిషనర్ సుభాష్ రావు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని ఆయాపాఠశాలల్లో కాళోజీ జయంతిఉత్సవాలను ఘనంగ నిర్వహించారు.

మెదక్ జిల్లాలో..

మెదక్ ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ, కలెక్టరేట్‌లో కాళోజి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి ఎస్పీ శ్రీనివాసరావు, డీఆర్వో భుజంగరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హవేళీఘణపూర్ మండలంలోని కూచన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో మధుమోహన్ తెలుగు ఉపాధ్యాయులతో కలిసి కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. పాపన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాళోజీ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ బాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పద్యాల పోటీలో విజేతలైన విద్యార్థులకు తెలుగు శాఖ తరపున బహుమతులు అందజేశారు. వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బాలలక్ష్మి ఇతర ఉద్యోగులతో కలిసి ఘనంగా నివాళుర్పించారు. చేగుంట తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీకాంత్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, జడ్పీ హైస్కూల్లో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కాళోజి చిత్రపటానికి నివాళులర్పించారు. తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. అదేవిదంగా తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పాతూరి గణేశ్ రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



పాపన్నపేటలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం, శివ్వంపేటలో సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

పాపన్నపేట/శివ్వంపేట/మనోహరాబాద్/జిన్నారం, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని పలు మండలాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆదర్శవంతమైన సమాజ నిర్మాణం ఉపాధ్యాయులకే సాధ్యమని కొనియాడారు. ఒత్తిడి లేని విద్య అందించే కేంద్రాలు సర్కార్ బడులేనని స్పష్టం చేశారు. పాపన్నపేటలో జరిగిన మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాపన్నపేట మండల స్థాయిలో విశిష్ట సేవలు అందించిన 28 మంది టీచర్లకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందించారు. వీరితో పాటు పాపన్నపేట మండలం గాజులగూడెం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందిస్తూ రాష్ట్ర స్థాయికి ఎంపికైన సాయి సిరికి, జిల్లా స్థాయికి ఎంపికైన సాయిలు, చంద్రశేఖర్, మల్లేశం, దుర్గా ప్రసాద్‌లకు పురస్కారాల అందజేశారు. శివ్వంపేటలోని ఎంపీడీవో సమావేశం మందిరంలో మంగళవారం ఎంఈవో బుచ్చా నాయక్ అధ్యక్షతన గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీత రెడ్డి గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ సుహాసిని ముఖ్య అతిథులుగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సన్మానించారు. మనోహరాబాద్ మండలం గౌతోజీగూడా గ్రామంలో పాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను జిల్లా మాజీ ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేణు కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్థులు సన్మానించారు. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని మాదారం ప్రభుత్వ పాఠశాలలో యువజన వికాస సమితి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. అదేవిధంగా పదవ తరగతిలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులను అభినందించారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట 'డబుల్' లబ్ధిదారుల ధర్నా



ఆర్డీవోతో వాగ్వాదానికి దిగిన లబ్ధిదారులు

జోగిపేట, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): అందోలు-జోగిపేట మున్సిపల్ పరిధిలో డబుల్ బెడ్రూం ఇళ్ల రగడ రెండోరోజూ కొనసాగింది. తాము లేని సమయంలో అక్కడ నివాసముండడంలేదంటూ తమ ఇళ్లకు నోటీసులను అతికించడంపై లబ్ధిదారులు రెండోరోజూ ఆందోళనను కొనసాగించారు. మొదటి రోజు తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేసిన లబ్ధిదారులు, రెండోరోజు ఏకంగా ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించారు. నోటీసులు అందుకున్న లబ్ధిదారులంతా అందోలులోని ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుని ఆర్డీవో చాంబర్‌లోకి వెళ్లి ఆయనకు వినతి పత్రం ఇచ్చేందుకు యత్నించారు. ఇందుకు ఆర్డీవో నిరాకరించడంతో వారంతా గది ఎదుట నినాదాలు చేస్తూ ధర్నాకు దిగారు. దీంతో ఆర్డీవో పాండు నేరుగా బయటకు రాక తప్పలేదు. తమకు రెండేళ్ల క్రితం డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించడంతో నాటి నుంచి అందులోనే నివాసముంటున్నామని, తాము కూలీ పనికి వెళ్లిన సమయంలో కొందరు అధికారులు వచ్చి, తమను ఖాళీ చేయాలంటూ నోటీసులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. దీంతో ఆర్డీవో జోక్యం చేసుకుని నిజంగా ఉంటున్న లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, మరోసారి క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని హామీనివ్వడంతో వారంతా శాంతించి వెనుదిరిగారు.

కేజీబీవీల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం, అకౌంటెంట్ పోస్టులకు మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 నుంచి 15 వ తేదీ వరకు తమ బయోడేటా ఫారాలను సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమగ్ర శిక్ష కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు జిల్లా వాసులై ఉండాలని పేర్కొన్నారు. ఏఎన్ఎం పోస్టులకు ఇంటర్మీడియట్‌తో పాటు జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ ఉండాలని, అదే విధంగా అకౌంటెంట్ పోస్టులకు బీకాం లేదా ఎంకాంతో పాటు కంప్యూటర్ కోర్స్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని పేర్కొన్నారు.

మృత్యు శకటాలు

(5వ పేజీ తరువాయి)

జాతీయ రహదారుల విభాగం అధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. కానీ నామమాత్రంగా సమీక్షలు నిర్వహించి క్షేత్రస్థాయిలో మాత్రం చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగానే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.

కఠినంగా వ్యవహరిస్తాం

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం. బ్లాక్ స్పాట్లు గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేశాం. రహదారుల పక్కన వాహనాలను పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రహదారిపై రాంగ్ రూట్‌లో వెళ్లడం, మద్యం సేవించి, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడంతోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

- పరితోష్ పంకజ్, సంగారెడ్డి ఎస్పీ

నాయకుల భూములు కాపాడేందుకే ట్రిపుల్‌ఆర్ రాంగ్ రూట్

● రోడ్డుపై ఆందోళన చేపట్టిన రైతులు

కొండాపూర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు,పేరు మోసిన బడా వెంచర్ల యాజమాన్యాల భూములు కాపాడే విధంగా రీజినల్ రింగ్ రోడ్డు మాస్టర్‌ప్లాన్, అలైన్‌మెంట్లలో ఇష్టమొచ్చినట్లు మార్పులు చేస్తున్నారని గంగారం, శివన్నగూడెం రైతులు మంగళవారం రోడ్డుపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 4వ జోన్ ట్రిపుల్‌ఆర్ మాస్టర్ ప్లాన్‌లో మొదటి సర్వేలో రాష్ట్రంలోనే పేరున్న నాయకులకు చెందిన భూములు, రెండవ దఫాలో బడా వెంచర్ల యాజమాన్యాల భూముల్లో సర్వే నిర్వహించారు. వారి భూములు కాపాడేందుకు 3వ దఫా సన్నా చిన్నకారుల రైతుల భూముల నుంచి ట్రిపుల్‌ఆర్ నిర్మాణపు పనుల సర్వే చేస్తారన్న సమాచారంతో గంగారం రెవెన్యూ పరిధి రైతులు రోడ్డుపై ధర్నా చేసి ఆందోళన నిర్వహించారు. వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న రైతుల భూములలోంచి రోడ్డు నిర్మాణాలను ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళనలో గంగారం, శివన్నగూడెం రైతులతో పాటు వికారాబాద్ జిల్లా దేవరంపల్లి, చక్రంపల్లి రైతులు పాల్గొన్నారు.

అధికారులు సమయపాలన పాటించాలి

రేగోడు సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అధికారులు సమయపాలన పాటిస్తూ కార్యాలయాలకు చేరుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని మెదక్ ఆర్డీఓ రమాదేవి పేర్కొన్నారు. మంగళవారం రేగోడు తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ చేసి, పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దత్తారెడ్డి, ఆర్ఐలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలి: మెదక్ డీఈవో

మెదక్ అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని డీఈవో రాధాకిషన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉన్నత విద్యలో రిజర్వేషన్ కల్పించడంతో పాటు ప్రశంసాపత్రం కూడా అందించనున్నట్లు తెలిపారు. 14 విభాగాల్లో పోటీలు ఈ నెల 19 వరకు జరుగనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీలకు 42 జట్లు, 502 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగరాజు, పీడీ, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.


నాణ్యమైన భోజనం అందజేయాలి



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

ఝరాసంగం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందజేయకపోతే చర్యలు తప్పవని ప్రత్యేక అధికారి, సిబ్బందికి సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు, జీసీడీవో సుప్రియ హెచ్చరించారు. కుళ్లిన కూరగాయలతో వండిన ఆహారపదార్థాలను, అరటిపళ్లను విద్యార్థులకు అందిస్తున్నారని ఇటీవల ఆరోపణలు వెల్లువెత్తడంతో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు మంగళవారం ఝరాసంగంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని వారు సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కుళ్లిన కూరగాయలు, అరటిపండ్లు లాంటివి విద్యార్థినులకు అందజేస్తే చర్యలతో పాటుగా వాటికి సంబంధించిన బిల్లులను నిలిపివేయడం జరుగుతుందన్నారు. వైరల్ ఫీవర్‌కు గురైన విద్యార్థినులకు పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందజేస్తున్నామన్నారు. పాత భవనంలో ఉన్న కిచెన్‌ను నూతన భవనంలోకి మార్చినట్టు తెలిపారు. విద్యార్థినిలకు ఎప్పటికప్పుడు తాజా కూరగాయలతో చేసిన భోజనం అందజేయలన్నారు. పాఠశాల పరిసరాలలో ఉన్న డ్రైనేజీ పైపులైన్‌కు మరమ్మతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. వారి వెంట ఎంఈవో శ్రీనివాస్, అధికారులు ఉన్నారు.

జాతీయస్థాయి కరాటే కీడ్రాకారిణికి సన్మానం



నితన్య సిరిని సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్, డీఈ

మెదక్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలిక నితన్య సిరిని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ మహేష్ మంగళవారం ఆయన ఛాంబర్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మధ్యతరగతికి చెందిన విద్యార్థిని జాతీయ స్థాయి కరాటే పోటీలలో పాల్గొని ప్రతిభ కనబర్చడం హర్షణీయమన్నారు. మెదక్ పట్టణానికి చెందిన నితన్య సిరి కరాటేలో సీనియర్ బ్లాక్ బెల్ట్ గ్రహీతగా కొనసాగుతున్నారు. కరాటేలో కటాస్, వెపన్స్, నాన్‌చాకో విభాగంలో బంగారు పతకాల్ని సాధించి, గ్రాండ్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ చేజిక్కించుకున్నారు. ఇప్పటి వరకు 11 బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా శాలువా,మెమోంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు నామకృష్ణ, కీర్తి నేత, ఏఈ నితిన్‌జైన ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ

రామాయంపేట,సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు మంగళవారం రామాయంపేట పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు.అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలు మెరుగ్గా ఉన్నాయన్నారు. పోలీసుల పని తీరుపై ఎస్.పీ సంతృప్తి వ్యక్తం చేశారు.

మద్యం తాగి సీఈవోపై దాడి.. ఇద్దరిపై కేసు

శివ్వంపేట , సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి) మద్యం సేవించి ఏకలవ్య ఫౌండేషన్ రైతు సంఘంలో విధులు నిర్వహిస్తున్న సీఈవోపై దాడి చేసి రికార్డులను ధ్వంసం చేసిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన మంగళవారం గోమారంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని గోమారంలో ఏకలవ్య ఫౌండేషన్ రైతు సంఘంలో నందం రాజేందర్ రెడ్డి సీఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన విధుల్లో ఉండగా అదే గ్రామానికి చెందిన గంగిరెడ్డి వీరారెడ్డి తన కుమారుడైన రాంచంద్రారెడ్డితో కలిసి మద్యం తాగి వచ్చి రాజేందర్‌రెడ్డిపై దాడి చేశారు. వీరారెడ్డికి ఈ నెల 8న 20 బస్తాల యూరియా ఇచ్చినప్పటికీ మరింత యూరియా కావాలంటూ మద్యం మత్తులో రాజేందర్‌రెడ్డి పై దాడి చేయడమే కాకుండా వడ్ల కొనుగోలుకు సంబంధించిన రికార్డులు రిజిస్టర్‌లను కూడా ధ్వంసం చేసినట్టు తెలిపారు. వారిని వారించేందుకు వచ్చిన ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాధవ రెడ్డితో పాటు గ్రామానికి చెందిన పలువురిని కూడా తీవ్ర పదజాలంతో దూషించారని రాజేందర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాంచంద్ర రెడ్డి, వీరారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

మెడికల్‌షాప్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

వెల్దుర్తి, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): మెడికల్ దుకాణాల నిర్వాహకులు తప్పకుండా నిబంధనలు పాటించాలని మెదక్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని మెడికల్ దుకాణాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించి బిల్లు బుక్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెదక్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ మాట్లాడుతూ... హోల్‌సేలర్స్ నుండి తీసుకున్న వివరాల ఆధారంగా వెల్దుర్తి లోని శ్రీనివాస మెడికల్ దుకాణంలో హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్, భద్ర మెడికల్ దుకాణంలో అబార్షన్ కిట్స్ విక్రయాలకు సంబంధించి రికార్డులను పరిశీలించాగా వాటి రికార్డులు సక్రమంగా లేవని తనిఖీలో గుర్తించినట్టు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం సంబంధిత మెడికల్ దుకాణాల నిర్వాహకులకు షోకాజ్ నోటీస్‌లు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం సరికాదు

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి చెలగాటమాడుతున్నారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మంగళవారం ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్-1 పిటిషన్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పునకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగులు బలవుతున్నారని, ఇప్పటికైనా రేవంత్ రెడ్డి కళ్లు తెరిచి తెలంగాణ యువతకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలన్నారు. గ్రూప్-1 పరీక్ష మూల్యాంకణంలో అవకతవకలు, పరీక్ష కేంద్రాల కేటాయింపులు, పరీక్ష ఫలితాల్లో అనుమానాలు, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని పేర్కొన్నారు. హడావుడిగా పరీక్షలు నిర్వహించి అవకతవకలకు పాల్పడిన మీ నిర్లక్ష్యానికి విద్యార్థులు బలవుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా నిరుద్యోగ యువతకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సబ్సిడీలు చెల్లించండి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రావాల్సిన సబ్సిడీలు వెంటనే చెల్లించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామిని మంగళవారం హైదరాబాద్‌లో అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు జగన్ కలిసి వినతి పత్రం అందజేశారు. విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లను కూడా విడుదల చేయాలని కోరారు.

కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

మనోహరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, ఇందుకోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని దండుపల్లి శ్రీమల్లిఖార్జున ఆలయం వద్ద పూజలు చేశారు. అనంతరం ఆలయం కోసం పనుల జాతరలో భాగంగా రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాలతో పాటు ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. దండుపల్లి గ్రామానికి చెందిన బండరి కృష్ణ కుమారుడి వైద్యం కోసం రూ.43 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఇందులో వైస్ఎంపీపీ విఠల్ రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.